క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎంపీటీసీ



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీ సంధ్యారాణి

నర్సాపూర్: మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి ఎంపీటీసీ సభ్యురాలు సంధ్యారాణి సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 15న మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డితోపాటు తాను బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరానన్నారు. అప్పుడు తాను సీఎంను కలువడానికి వీలు పడలేదని చెప్పారు. బుధవారం అపాయింట్‌మెంటు లభించడంతో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశానని సంధ్యారాణి తెలిపారు.

పుత్రకామేష్టి యాగానికి మంచి స్పందన



యాగంలో పాల్గొన్న దంపతులు

నర్సాపూర్: తమ ఆశ్రమంలో నిర్వహించిన పుత్రకామేష్టి యాగానికి మంచి స్పందన లభించిందని సువిజ్ఞాన ఆశ్రమ వ్యవస్థాపకుడు ఆచార్య సత్యవీర్ అన్నారు. బుధవారం చైత్ర మాసం పుష్యమి నక్షత్రం, శ్రీరామనవమి అరుదైన కలయికలో తమ ఆశ్రమంలో పుత్రకామేష్టి యాగం చేశామని, మెదక్, హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన పలువురు దంపతులు అధికసంఖ్యలో యాగంలో పాల్గొన్నారని ఆయన చెప్పారు. యాగం అనంతరం వారికి అవసరమైన ఆయుర్వేద మందులు అందజేశామని సత్యవీర్ తెలిపారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



శివ్వంపేట(నర్సాపూర్): ప్రచారం చేస్తున్న బుచ్చేశ్‌యాదవ్

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి రఘునందర్‌రావుకు ఓటు వేయాల్సిందిగా వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేశ్‌యాదవ్ దొంతి గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ సతీశ్ యాదవ్, మండల అధ్యక్షుడు రవి, అశోక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్ (మెదక్)లో..

మండలంలోని ధన్నారం గ్రామంలో లాభార్థి సంపర్క్ అభియాన్, ఇంటింటి ప్రచార కార్యక్రమం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి బీజేపీ నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నవీన్, సిద్ధిరాములు, దుర్గాప్రసాద్, రాములు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఎంపీపీ చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

నిజాంపేట(మెదక్): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పల్లెల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎంపీపీ దెశెట్టి సిద్ధరాములు అన్నారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు నార్లాపూర్, చల్మెడ మాజీ సర్పంచ్‌లు అమరసేనారెడ్డి, నర్సింహారెడ్డి, రజాక్‌పల్లి, తిప్పన్నగుల్లకి చెందిన నాగరాజు, యాదగిరికూడా ఉన్నారు. వారిని ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నిజాంపేటలో మోస్తారు వర్షం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు గ్రామలలో బుధవారం సాయంత్రం ఉరుములు, పిడుగులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. వర్షం ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కల్లాలో ఉన్న వరి ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. కొన్ని రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు ఇదో పెద్దదెబ్బగా భావిస్తున్నారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్న తమకు ఈ వర్షంతో మరింత నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- సమస్యల వలయంలో ఫైర్ స్టేషన్
- పక్కా భవనం లేదు
- అవసరమైన సిబ్బంది కరువు
- మౌలిక వసతుల్లేక ఇబ్బందులు



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న ఫైర్‌స్టేషన్

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం సమస్యలతో సతమతమవుతోంది. 2015లో పెద్దశంకరంపేట, యాదాద్రిలో రెండు అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే పెద్దశంకరంపేట కేంద్రానికి ఇప్పటి వరకు పక్కా భవనం లేక తాత్కాలిక భవనంలోనే కొనసాగుతోంది. అంతే కాదు నిర్వహణ, నిధుల మంజూరుకాక, అరకొర సిబ్బందితో కార్యాలయం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

అరకొర వసతుల మధ్య విధులు

పెద్దశంకరంపేట అగ్నిమాపక కేంద్రం పరిధిలో అల్లాదుర్గం, పాపన్నపేట, రేగోడ్, టేక్మాల్ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఆయా గ్రామాలలో అత్యవసర సమయాల్లో ఈ కేంద్రం సేవలు అందిస్తోంది. దీనిని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం పక్కన ఎత్తివేసిన ఓ పాఠశాల భవనంలో ఏర్పాటు చేశారు. 16పోస్టులు కేటాయించగా, ప్రస్తుతం 9మంది మాత్రమే పనిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం అగ్నిమాపక వాహనానికి రూ.5లక్షలతో షెడ్డు నిర్మించారు. విధుల్లో ఉన్న సిబ్బంది తాత్కాలిక భవనంలో ఉంటున్నారు. ఫర్నిచర్, నీటి వసతి లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టాయిలెట్స్ లేవు, ఫ్లోరింగ్ కూడా సరిగా లేకపోవడంతో భవనం పాములు, కీటకాలకు నిలయమైంది. దీంతో సిబ్బంది నిత్యం భయం మధ్య విధులు నిర్వహిస్తున్నారు.

నీరు నింపాలంటే..

ఫైర్ ఇంజన్‌కు ప్రధానమైంది నీరు. ఆ నీటి కోసం అత్యవసర సమయాల్లో పొలాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని సిబ్బంది, స్థానికులు వాపోతున్నారు. ఫైర్ స్టేషన్‌కు పక్కన ఉన్న ట్యాంకు ద్వారా పైపులైను వేసి నీటి సదుపాయం కల్పించారు. కానీ అవి సిబ్బంది అవసరాలకే సరిపోతున్నాయి. ఫైర్‌స్టేషన్‌లో సంపు, బోరు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

శాశ్వత భవనం ఉంటేనే..

ఫైర్‌స్టేషన్‌కు శాశ్వత భవన నిర్మాణానికి అధికారులు గతంలో స్థలాన్ని పరిశీలించినా, ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు. సంబంధిత ఫైల్‌కు మోక్షం ఎప్పుడు దక్కుతుందా అని సిబ్బంది ఎదురుచూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఫైర్‌స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఫైర్‌స్టేషన్‌కు పక్కా భవనం ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందికి నివాస భవనం కూడా నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయి.

> **ప్రతిపాదనలు పంపించాం..**
>
> ఫైర్‌స్టేషన్ భవనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. సిబ్బంది నియామకం, సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో సిబ్బందిని తీసుకొనే అవకాశం ఉంది.
>
> – శ్రీశైలం, ఎస్‌హెచ్‌ఓ, పెద్దశంకరంపేట

అగ్నిప్రమాదాలపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా బుధవారం స్థానిక ఫైర్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీశైలం ఆధ్వర్యంలో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. మంటలు సంభవిస్తే వెంటనే ఫైర్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది రాజావెంకట్‌రెడ్డి, రమేశ్, రాజశేఖర్, సాయికిరణ్, గోపాల్, రాజేందర్, ఇబ్రహీం తదితరులున్నారు.

అన్ని రంగాలలో రాణించాలి

పద్మశాలీ సంఘం నేత జయరాం



పద్మశాలీ సంఘం నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): పద్మశాలీలు అన్ని రంగాలలో రాణించాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాళ్లకల్ గ్రామ పద్మశాలీ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా బొమ్మ బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా గుండు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడుగా హరినాథ్, ఉపాధ్యక్షుడుగా గుండు పుండరీకం, మేర్గు భిక్షపతి, సహాయ కార్యదర్శిగా కుమార్, బండారి శ్రీనివాస్, సత్యనారాయణ, కోశాధికారిగా అశోక్, మహిళా అధ్యక్షురాలిగా శివలక్ష్మి, యూత్ అధ్యక్షుడుగా చెడుదీప్ అమరేందర్, ప్రధాన కార్యదర్శిగా రచ్చ సాయికుమార్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహేందర్, భిక్షపతి, వెంకటరమణ, రాజు, రమేశ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఆదరణ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు తిరుమల్ రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ పెరిగిందని మెదక్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు తిరుమల్ రెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరులో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేసిందన్నారు. 29 వేల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. మెదక్ ఎంపీగా నీలం మధు గెలుపే లక్ష్యమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మొద్దన్నారు. మతం పేరుతో రాజకీయం చేస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు పర్శరాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి



జెండాలను పంపిణీ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): హనుమాన్ జయంతి నాడు గ్రామాల్లో యువకులు బైక్ ర్యాలీలతో హోరెత్తించాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గంగాపూర్, మర్కూక్, పాములపర్తి, దామరకుంట, ఎర్రవల్లి, చేబర్తి, నర్సన్నపేట, వర్దరాజ్‌పూర్, పాతూర్ తదితర గ్రామాలలో హనుమాన్ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభాయాత్రను ప్రతీ గ్రామంలో నిర్వహించాలని, ఇంటిపై కాషాయ జెండా ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్‌సింగ్, హిరామాన్‌సింగ్, రాజేందర్‌సింగ్, పవన్‌సింగ్, దుర్జన్‌సింగ్, భవానీసింగ్, నరేష్‌సింగ్, జగదీష్‌సింగ్, మనిరాంసింగ్, నర్సింగ్, జేత్రాంసింగ్, తదితరులు పాల్గొన్నారు

రాజకీయాల కోసం ధర్మం తప్పొద్దు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుంపలపల్లిలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: తమ స్వార్థ రాజకీయాల కోసం ధర్మం తప్పడం విచారకరమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లిలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో స్వార్థం పెరిగిపోతుందన్నారు. ఎన్నికష్టాలు ఎదురైనా ధర్మం తప్పొద్దని, సాధ్యమైనంత వరకు ఇతరులకు సాయం చేయాలే తప్ప హాని తలపెట్టొద్దన్నారు. శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు చెప్పారు.

అంతా రామమయం..

శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా బుధవారం రామాలయాల్లో అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించారు. అన్ని ఆలయాల ఆవరణల్లోనూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల్లో సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా జరుపుకున్నారు. రామాలయాలు జైశ్రీరామ్ నామస్మరణతో మారుమోగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పానకం తయారుచేసి అందరికీ పంచుకున్నారు. ఆయా ఆలయాల్లో రాజకీయ ప్రముఖులు, నాయకులు శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఊరేగింపు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.



నర్సాపూర్: సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): హారతినిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దంపతులు



శివ్వంపేట(నర్సాపూర్): కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు



టేక్మాల్ (మెదక్): వేల్పుగొండలో జరిగిన ఉత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర



మనోహరాబాద్(తూప్రాన్): నవమి వేడుకల్లో నీలం మధు తదితరులు



రామాయంపేట(మెదక్)లో ఎమ్మెల్యే శేరి దంపతులు



రేగోడ్: కల్యాణం జరిపిస్తున్న భక్తులు



అల్లాదుర్గం(మెదక్): వెంకటేశ్వర ఆలయంలో..



పాపన్నపేట(మెదక్): పాపన్నపేటలో..



తూప్రాన్: కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..



నిజాంపేట(మెదక్): నిజాంపేటలో..

బస్సులు నడపండి సార్..

- అందుబాటులోకి బీటీ రోడ్లు
- పల్లెలకు రాని బస్సుసౌకర్యం
- మాకు 'మహాలక్ష్మి' వర్తించదా?
- ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందులు



కల్వకుంట నుంచి నార్లాపూర్‌కు పూర్తయిన బీటీ రోడ్డు

నిజాంపేట(మెదక్): మారుమూల గ్రామాలకు బీటీ రోడ్డు సదుపాయం ఉన్నా చిరకాల స్వప్నం సాకారం కావడం లేదని కొన్ని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించింది. కాని నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట, వెంకటపూర్.కె, నార్లాపూర్, తిప్పన్నగుల్ల, రజాక్‌పల్లి, శౌకత్‌పల్లి, రామాయంపేట మండలంలోని పూలిమామడి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం కోట్ల నిధులతో రోడ్డు పూర్తి చేయడంతో నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట కమాన్ నుంచి నార్లాపూర్ గ్రామ శివారు వరకు డబుల్ లైన్ రోడ్డు అందుబాటులోకి వచ్చింది. కాని ఈ మార్గంలో బస్సులు మాత్రం నడపడం లేదు.

తక్కువ సమయంలో..

సిద్దిపేట జిల్లా దుబ్బాక డిపో నుంచి గాని, మెదక్ డిపో నుంచి రామాయంపేట, నిజాంపేట మీదుగా గజ్వేల్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తే నిజాంపేట మండల ప్రజలకు గజ్వేల్, యాదగిరిగుట్ట వెళ్లడానికి తక్కువ సమయం పడుతుంది. మామూలుగా అయితే యాదగిరిగుట్టకు వెళ్లాలంటే సిద్దిపేటకు వెళ్లి అక్కడి నుంచి వెళ్లేవారు. కాని ఈ రోడ్డులో బస్సులు నడిపితే చాలా మంది తక్కువ సమయంలో ప్రయాణించవచ్చు.

మహాలక్ష్మి పథకం వర్తించదా?

నిజాంపేట మండల పరిధిలోని మొత్తం 14 గ్రామాలు ఉంటే అందులో రెండు గ్రామాలు తప్ప మిగిలిన గ్రామాలకు బస్సు సదుపాయం లేదు. ఈ గ్రామాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వర్తించదా? అని వాపోతున్నారు. ప్రైవేట్ వాహనాలనే దిక్కు అవుతున్నాయని, వాటివల్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు బీటీ రోడ్డు పూర్తయిన మార్గాలలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

> **మా గ్రామాలకు బస్సులు నడపండి**
>
> 
>
> అనారోగ్యం పాలైనా, అత్యవసర పరిస్థితుల్లోను నిజాంపేట, సిద్దిపేటకు, రామాయంపేట వెళ్లాల్సిన పరిస్థితి. కాని ఇక్కడకు మా ఊరి నుంచి ఆటోలోనే ప్రయాణించాలి. ఆటోలలో కిక్కిరిసి వెళ్లాలి. మా ఊరికి బస్సులు నడిపితే మంచిగా ఉంటుంది. బస్సులు నడపాలని అధికారులను కోరుతున్నాం.
>
> – గొల్ల రేణుక, నార్లాపూర్

> **పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు..**
>
> 
>
> మా పిల్లలు రామాయంపేట మండల పరిధిలోని కోమటపల్లి గ్రామంలో ఉన్న మోడల్ పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రతి రోజు విద్యార్థులు బస్సులు లేకపోవడంతో ఆటోలో వెళ్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మోడల్ పాఠశాలలకు సుమారుగా 100మందికి పైగా వెళ్తారు. వారి కోసం బస్సులు నడుపుతారని ఎదురుచూస్తున్నాం.
>
> –అందె శ్వేత, విద్యార్థుల తల్లి, కల్వకుంట